క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గ్రామకమిటీలు ఏర్పాటు



శావల్యాపురం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలు ఎంతగానో దోహదపడతాయని పార్టీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) అన్నారు. ఆదివారం మండలంలోని ఇర్లపాడు గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారధ్యంలో మండల, గ్రామ స్థాయి నాయకుల సహకారంతో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పార్టీ ఇర్లపాడు గ్రామ నూతన అధ్యక్షుడిగా వెలగపూడి వీరాంజినేయులు, కొత్తలూరు: మామిళ్లపల్లి వెంకటేశ్వర్లు, కనమర్లపూడి: బోడెపూడి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నుంచి ఇరువురి సస్పెన్షన్

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన ఇరువురిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్న, పాతవరంకు చెందిన షేక్ అబ్దుల్‌బాష పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులు నేపథ్యంలో పార్టీ క్రమ శిక్షణా కమిటీ సిఫార్స్ మేరకు ఇరువురిని సస్పెండ్ చేస్తున్నట్లు కేంద్ర కార్యాలయం పేర్కొంది.

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు



వినుకొండ: మానవ సేవా సమితి ఆధ్వర్యంలో అనాధ వృద్ధుడి మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు గత రెండు రోజుల క్రితం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో ఉంచి అతని ఆచూకీ కోసం ప్రయత్నించారు. మృతునికి సంబంధించిన ఆచూకీ పోలీసులకు లభించపోవడంతో మానవసేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పి.వి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చామర్తి భవాని శంకర్, సభ్యులు అంజి, మస్తాన్‌వలి, జాబీర్, సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

జారిపడి గాయాలైన వృద్ధుడు మృతి

యడ్లపాడు: చర్చి ప్రాంగణంలో జారిపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన విజయకాటన్ సమీపాన నివాసం ఉంటున్న అతిరాజు గురవయ్య(66) తమ ఇంటిపక్కనే ఉన్న చర్చికి శనివారం వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో అక్కడ వరండాలో ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. దీంతో అతని తల వెనుక భాగంలో తీవ్రంగా గాయమైంది. స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారంతో 108 వాహన సిబ్బంది బాధితుడిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. కానీ గాయాల తీవ్రతకు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు అతిరాజు మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యడ్లపాడు: ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కారుచోల గ్రామానికి చెందిన తాపీమేస్త్రి నల్లజాం కోటేశ్వరరావు(40) కూలి డబ్బుల నిమిత్తం గ్రామం నుంచి యడ్లపాడుకు ఆదివారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో ఒడిశాకు చెందిన మిథున్‌మాలిక్ దంపతులు స్కూటీపై యడ్లపాడులో పనులు చూసుకుని కారుచోల రోడ్డులోని నూలుమిల్లుకు వస్తున్నారు. సరిగ్గా యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీ దాటిన తర్వాత కొద్దిదూరంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారుచోలకు చెందిన కోటేశ్వరరావు తీవ్రంగా, స్కూటీపై మహిళకు స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కోటేశ్వరరావును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కోటేశ్వరరావుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

స్టేడియం.. సమస్యల నిలయం!

- అధ్వానంగా స్టేడియంలో పరిసరాలు
- దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్
- మూతపడిన స్విమ్మింగ్ పూల్, మరుగుదొడ్ల బ్లాక్‌లు
- 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'లో స్టేడియాన్ని సందర్శించిన వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



అధ్వానంగా తయారైన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: సమస్యలతో సతమతమవుతున్న స్టేడియంపై పాలకులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఆదివారం సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆయన పర్యటించారు. స్టేడియంలో కలయతిరిగి అక్కడి సమస్యలను వాకర్స్, క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా మారిన స్విమ్మింగ్ పూల్, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ స్టేడియం నిర్వహణను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్టేడియంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టకపోగా అందుబాటులో ఉన్న సౌకర్యాలను నిరుపయోగంగా మారుస్తుందని విమర్శించారు.

■ అసాంఘిక కార్యక్రమాలకు స్టేడియం అడ్డాగా మారుతుందని తెలిపారు. చీకటిపడితే మందుబాబులు స్టేడియంలో కనిపిస్తున్నారని, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే మహిళలు భయాందోళనలు చెందుతున్నారని తెలిపారు. స్టేడియంలో విద్యుత్ దీపాలు కూడా పనిచేయకపోవడంతో సాయంత్రం సమయంలో వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. స్టేడియానికి వచ్చేవారు ఉపయోగించుకునేందుకు ఏర్పాటు చేసిన పురుషుల, స్త్రీల మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్వహించలేక తాళాలు వేశారని తెలిపారు. మున్సిపల్ అధికారులు మరుగుదొడ్ల నిర్వహణను చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వాకింగ్ ట్రాక్ అస్తవ్యస్తంగా ఉందని, వర్షం పడితే బురదమయంగా మారడంతో పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

■ స్టేడియం బాధ్యతలను గతంలో మాదిరిగా వ్యాయమ ఉపాధ్యాయులకు అప్పగించాలని డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. జిమ్‌లో ఇప్పటికీ పరికరాలు అందుబాటులోకి రాలేదని, ప్రతి నెల నిర్వాహకుల నుంచి శాప్ అద్దె వసూళ్లు చేస్తుందన్నారు. పరికరాలు లేకపోవడంతో జిమ్‌కు తక్కువమంది వస్తున్నారని దీని వలన నిర్వాహకులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. గతంలో స్టేడియం నిర్వహణను ప్రభుత్వ పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారని తెలిపారు. శాప్ దీనిని తమ అధీనంలోకి తీసుకున్న తరువాత నిర్వహణ సక్రమంగా లేదని పేర్కొన్నారు.

■ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు స్విమ్మింగ్ పూల్‌ను ఉపయోగించడం లేదన్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ శాప్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూలనపడే పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహ్మాన్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు అచ్చి శివకోటి, నిడమానూరి సురేంద్ర, పార్టీ సీనియర్ నాయకులు ఖాజావలి మాస్టారు, జిల్లా కార్యదర్శి సుజాతపాల్, అంగన్‌వాడీ విభాగ నాయకురాలు హెల్డా ఫ్లోరెన్స్, గంటెనపాటి గాబ్రియేల్, బండి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

15 రోజులుగా చెత్త తీయడం లేదు

నరసరావుపేట రూరల్: పట్టణంలోని 17వ వార్డు వరవకట్ట న్యూ ఆంధ్రా మున్సిపల్ స్కూల్ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలను పరిశీలించారు. గత 15రోజులగా చెత్త, వ్యర్థాలను తొలగించలేదని స్థానికులు డాక్టర్ గోపిరెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. పాఠశాల, ప్రైవేటు వైద్యశాల ఉన్న ప్రాంతంలో కూడా చెత్తను తొలగించడం లేదని, పట్టణంలోని పలు ప్రాంతాలు డంపింగ్ యార్డ్‌లుగా మారుతున్నాయని డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున చిన్నారులకు విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు వెంటనే చెత్త తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.



వరవకట్ట ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

చుక్కనీరు దొరక్క తిప్పలు

- మంచినీటి కోసం రాజీవ్ గృహకల్ప వాసుల ఆందోళన
- 350 గృహాలకు రెండే కుళాయిలు



మంచి నీటి కోసం ఆందోళన చేస్తున్న రాజీవ్ గృహకల్ప వాసులు


నరసరావుపేట టౌన్: మంచినీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ గృహకల్ప వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గృహవాసులు దుర్గాబాయి, మాణిక్యమ్మ మాట్లాడుతూ పెద్ద చెరువు రాజీవ్ గృహకల్ప సముదాయంలో 350 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. మొత్తానికి కలిపి రెండు మాత్రమే మున్సిపల్ కుళాయిలు ఉన్నాయన్నారు. దీంతో ప్రతి రోజు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. గృహకల్ప సముదాయంలో ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద గల సంపు నుంచి నాలుగురోజులకొకసారి నీరు విడుదల చేస్తున్నానన్నారు. ఒక్కొక్కరివద్ద నుంచి రూ.200 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని ప్రస్తుతం ఆ నీటిని కూడా విడుదల చేయటం లేదన్నారు. మంచి నీటి కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మున్సిపల్ అధికారులను కలిసి ఇప్పటికే అనేకమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. నివాసం ఉంటున్నవారంతా పేదలేనని కావల్సిన మంచినీరు దొరకక పోవటంతో కొనుగోలు చేసి తాగాల్సి వస్తుందన్నారు. దీంతో పాటు మంచినీటి బిందెలు మోసుకొని 3 అంతస్తులు ఎక్కాల్సి వస్తుండటంతో వృద్దులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో షాహినా, శ్రావణి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు



అక్రమంగా మట్టి తవ్వుతున్న దృశ్యం

బొల్లాపల్లి: అక్రమార్కులు బొల్లాపల్లి మండలంలోని ఆయా గ్రామ పొలాల్లోని భూములే లక్ష్యంగా చేసుకొని రూ.లక్షల విలువ చేసే మట్టిని కొల్లగొడుతున్నారు. మండలంలోని వడ్డెంగుంట, సరికొండపాలెం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో మట్టిని వినుకొండకు తరలిస్తూ అక్కడి నుంచి వెంచర్లకు, పలు ప్రదేశాలకు తరలించి రూ.లక్షలు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత 6, 7 నెలలుగా అక్రమట్టి వ్యాపారం చోరుగా సాగుతుందని మీడియాలో కథనాలు వెలువడుతున్నప్పటికీ పట్టించుకోకుండా, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ మట్టి మాఫియా విజృంభిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి, రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండానే అక్రమార్జన నిరాటంకంగా సాగుతుంది. పట్టించుకోవాల్సిన అధికారులు మిన్నకుంటుండడంతో అక్రమార్కులకు అడ్డే లేకుండాపోయింది.



చర్యలు తీసుకుంటాం..



అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టా భూముల్లో సాగుకు అనుకూలంగా మట్టిని తవ్వుతున్నారు. ప్రభుత్వ భూముల్లో తవ్వి మట్టి వ్యాపారం చేస్తే ఊరుకోం. మా దష్టికి వచ్చినప్పుడు అధికారులు అక్కడికి పంపి నిలుపుదల చేశాం. తదుపరి చర్యలు తప్పనిసరి తీసుకుంటాం

– ఎ.వి.సుధాకర్, తహసీల్దార్

వైభవం.. ఉరుసు మహోత్సవం

- భక్తిశ్రద్ధలతో హజరత్ ఖాదర్‌మస్తాన్ ఔలిఅల్లా 147 ఉరుసు
- బాబావారిని దర్శించి ప్రత్యేక ప్రార్థనలు



హజరత్ ఖాదర్‌మస్తాన్ ఔలిఅల్లా దర్గా

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: కలతలు దూరం చేసి కోరిన కోర్కెలు కరుణామూర్తిగా ప్రసిద్ధి చెందిన హజరత్ ఖాదర్‌మస్తాన్ ఔలిఅల్లా వారి దర్గా భక్తులతో కళకళలాడింది. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని గ్రామ సచివాలయం సమీపాన ఉన్న ఈ బాబావారి దర్గా 147వ ఉరుసు మహోత్సవం శనివారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. ఉరుసుకు గ్రామస్తులే కాకుండా సమీప ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. హిందూ ముస్లిం వ్యత్యాసం లేకుండా బాబావారిని దర్శించుకుంటూ భక్తులు మతసామరస్యాన్ని చాటారు. దర్గాతో పాటు వీధిలోనూ విద్యుత్ దీపాలతో అలంకరణ గావించారు. ఆకుపచ్చ, ఎరుపు చాద్దర్‌పై..మల్లె, గులాబీల పుష్పాలతో..అత్తర్, గంధం, అగరబత్తీలతో బాబా వారి సమాధిపై పరిమళాలు వెదజల్లాయి. ముజావర్లు, దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి బాబావారి సమాధి వద్ద ఖురాన్ ఆయతులను పఠించారు. భక్తులు దర్గాను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు సందర్భంగా మౌలానా షేక్ బాజీషహిద్, మౌలానా సాధిక్‌సాహెబ్, ముఫ్తి అబ్దుల్ కరీమ్‌సాహెబ్ హాజరై హజరత్ ఖాదర్‌మస్తాన్ ఔలిఅల్లా దర్గాలో ప్రత్యేక దువా చేశారు. అనంతరం దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు కక్కెర పుల్లారావు, కక్కెర శంకరరావు ఇంటి నుంచి భారీ ఊరేగింపుగా తీసుకువచ్చిన గంధాన్ని పంపిణీ చేశారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు ఉరుసుకు హాజరైన వేలాది మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. దర్గా కమిటీ సభ్యులు షేక్ అల్లాబక్షు, షేక్ ఖాదర్‌వలి, షేక్ అబ్దుల్‌రవుఫ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక దువా చేస్తున్న మౌలానా షేక్ బాజీషహిద్, మౌలానా సాధిక్ సాహెబ్, ముఫ్తి అబ్దుల్ కరీమ్ సాహెబ్

కారులో మంటలు


సకాలంలో అదుపు చేసిన ఫైర్ సిబ్బంది



కారుముందు భాగం మంటల్లో ధ్వంసమైన దృశ్యం

చిలకలూరిపేట: నిత్యం రద్దీగా ఉండే చిలకలూరిపేట ప్రధాన రహదారిలో ఒక కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట పట్టణంలోని సీఆర్ కాలనీ నుంచి ఎన్ఆర్‌టీ సెంటర్‌కు వెళ్తున్న ఏపీ 39 కేడబ్ల్యూ 1912 నంబరు గల కారు మున్సిపల్ కార్యాలయం దగ్గరకు రాగానే, ఇంజిన్ నుంచి పొగలు రావడం మొదలైంది. ఇది గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే కారు దిగి పక్కకు వెళ్లిపోయాడు. పొగలు చూసిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ స్టేషన్ అదే రోడ్డులో ఉండటంతో, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే, వారు వచ్చేలోపు కారులోంచి మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. సిబ్బంది అరగంటకు పైగా కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చారు. కానీ అప్పటికే కారు ముందు ఇంజిన్ భాగం పూర్తిగా కాలి ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ప్రజలకు గానీ, సమీపంలోని దుకాణాలకు గానీ ఎటువంటి నష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపిక



నరసరావుపేట రూరల్: ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 20 వరకు ఏపీ, తెలంగాణ డైరక్టరేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంప్‌కు కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్స్ నేహా నర్తిత, సుమన్యలు ఎంపికైయ్యారని వివరించారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా క్యాడెట్స్ భారత సైన్యంలోని జీవన విధానం, క్రమశిక్షణ, ఆయుధాల వినియోగం, ఫీల్డ్ క్రాఫ్ట్, పరేడ్ డ్రిల్స్, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై శిక్షణ పొందుతారని కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాకేష్ తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, విభాగాధిపతి డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ వీఎస్ఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీ దత్తాలో ఏఐ ఆధారిత సీటీ స్కాన్ ప్రారంభం



సీటీ స్కాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: పట్టణంలోని శ్రీ దత్తా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక రక్తనాళ హై రిజుల్యూషన్ సీటీ స్కాన్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలను అందిపుచ్చుకుంటూ పల్నాడు ప్రాంతానికి చేరువ చేస్తున్న హాస్పిటల్ ఎంపీ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్‌ను అభినందించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ జిల్లా వైద్య రంగంలో ఈ సరికొత్త టెక్నాలజీ ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, హాస్పిటల్ మెడికల్ డైరక్టర్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరి, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు గోపిరెడ్డి ప్రత్యేక పూజలు



పోలేరమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: మండలంలో బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో ఆదివారం వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన డాక్టర్ గోపిరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో జరుగుతున్న శ్రీపోలేరమ్మ తల్లి కొలుపుల మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెం పున్నారెడ్డి, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర నాయకులు పడాల చక్రారెడ్డి, కార్యదర్శి గెల్లి చిన కోటిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బత్తుల రామకృష్ణ, ఎంపీటీసీ మోతుకూరి వెంకటేష్, మండల నాయకులు కల్లి వెంకటరెడ్డి, పొనుగోటి వెంకట్రావు, గంటా వీరారెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, కల్లం శివారెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నల్లమోతు ప్రవీణ్

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శ్రీ గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని సీనియర్ సర్జన్ డాక్టర్ పువ్వాడ సూర్యనారాయణ ప్రారంభించారు. నరసరావుపేట గాంధీ హాస్పటల్‌లో పనిచేస్తున్న డాక్టర్ మెడబలిమి సౌమ్య, ఏలూరు ఆయుష్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ పాల్గొని 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. నల్లమోతు ఫకీరయ్య, స్వరాజ్యమ్మ జ్ఞాపకార్థం తమ స్వగ్రామంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బీపీ, షుగర్, అన్ని రకాల పరీక్షలు, ఈసీజీ, కిడ్నీ, నరాల పరీక్షలు నిర్వహించారు. కొందరికి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. నాదెండ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నెల్లూరి సదాశివరావు, మొండెద్దు జగన్నాధరెడ్డి, నల్లమోతు నారాయణస్వామి, వేములపల్లి రామచంద్రయ్య, భుజంగరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నివాసాల నడుమ జంతు కళేబరాలు

- దుర్గంధంతో టిడ్కో కాలనీ వాసుల ఇబ్బందులు
- పరిశీలించిన ప్రజాసంఘాల నాయకులు



జంతు కళేబరాలను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: టిడ్కో హౌసింగ్ కాలనీ పరిసరాల్లోని పశు కళేబరాలను వెంటనే తొలగించి, కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చిలకలూరిపేట రోడ్డులోని టిడ్కో హౌసింగ్ సముదాయాన్ని పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, ఎంఐఎం నాయకుడు షేక్ మస్తాన్‌వలి తదితరులు ఆదివారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పది సంవత్సరాల క్రితం డబ్బులు చెల్లిస్తే ఇల్లు ఇచ్చారని, ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. నీటి సౌకర్యం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, ప్రధాన రోడ్డులో కూడా వీధి దీపాలు లేవని తెలిపారు. కాలనీ చుట్టుపక్కల పశువుల కళేబరాలను, వ్యర్థాలను వ్యాపారులు నిల్వ చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి వచ్చే దుర్గంధంతో అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. పశు వ్యర్థాలను జొన్నలగడ్డ – కేసానుపల్లి మధ్యలోని వాగులో వేస్తున్నారని, ఈ కలుషిత నీటిని రైతులు పంటలకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని తెలిపారు. పశువుల కళేబరాల వేయవద్దని అడ్డుకుంటే తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. అధికారులు ఈ కాలనీ పరిసరాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.



టిడ్కో కాలనీ సమీపంలో జంతు వ్యర్థాలు

'చిరుమామిళ్ల' హైస్కూల్‌కు పురస్కారం గర్వకారణం

కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు సిరిపురపు అప్పారావు



నాదెండ్ల: సరస్వతీ పుత్రుల నిలయమైన చిరుమామిళ్ల శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారానికి ఎంపికకావటం జిల్లాకే గర్వకారణమని కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ డాక్టర్ సిరిపురపు అప్పారావు చెప్పారు. తన స్వగ్రామమైన చిరుమామిళ్ల ఉన్నత పాఠశాలకు గతంలో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ స్కూలుగా ఎంపిక చేసిందని, ఇక్కడి ఉపాధ్యాయులు అంకితభావం, క్రమశిక్షణతో విద్యార్థులకు మెరుగైన బోధన చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 15న పురస్కారం అందుకోనున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

రక్తదానం సామాజిక బాధ్యత

శావల్యాపురం: రక్తదానం చేయటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రెడ్ క్రాస్ గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ చిలంకూరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కనమర్లపూడి గ్రామంలో గ్రామపెద్ద ముక్కపాటి నాగేశ్వరరావు సారధ్యంలో నరసరావుపేట రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ముక్కపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను సకాలంలో కాపాడటం కూడా పౌరులుగా బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్రాణానికి మూలం రక్తమని, ఆపత్కాలంలో రక్తదానం చేయటం మంచి సేవా అన్నారు. నేటి యువత రక్తదానం ఆవశ్యకతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులను అభినందించి, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పొత్తూరి రాము, బెల్లకొండ ప్రసాదు, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.